
సాక్షి
గుంటూరు
మంగళవారం । 1 । జూలై । 2025



ఆలయ నిర్మాణానికి విరాళం

నరసరావుపేటరూరల్:ఇస్సప్పాలెంలోని మహంకాళి ఆలయ నిర్మాణానికి పట్టణానికి చెందిన దొడ్డ రఘురామిరెడ్డి, శాంతకుమారి దంపతులు రూ.2.50,000 అందజేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్:నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 514.20 అడుగుల వద్ద ఉంది. ఇది 138.9118 టీఎంసీలకు సమానం.



కరపత్రాల ఆవిష్కరణ

ఇంద్రకీలాద్రి(విజయవాడ): ఇంద్రకీలాద్రిపై 8వ తేదీ నుంచి ప్రారంభం కానున్న శాకంబరీ ఉత్సవాల కరపత్రాలను ఆలయ ఈవో శీనానాయక్ సోమవారం ఆవిష్కరించారు.

న్యూస్‌రీల్

కేంద్ర జల శక్తి బృందం పర్యటన



లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్) : కేంద్ర జల శక్తి శాఖ ద్వారా గుంటూరు జిల్లాలో అమలవుతున్న వివిధ పథకాల అమలు తీరును పరిశీలించేందుకు కేంద్ర జల శక్తి శాఖ అధికారులు కిరణ్‌కుమార్ కర్లపు, రేష్మ పిళ్ళైలతో కూడిన అధికారుల బృందం సోమవారం జిల్లాలో పర్యటించింది. ముందుగా జిల్లా కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. జల్‌జీవన్ మిషన్, నీటిలభ్యత, అమృత్ 2.0, చిన్న నీటిపారుదల పథకాలు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ద్వారా చేపడుతున్న పథకాల పురోగతిని సమీక్షించారు. అనంతరం గుంటూరులో అమృత్ పథకం ద్వారా చేపడుతున్న పనులను పరిశీలించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ శంకర్, గ్రామీణ నీటి సరఫరా విభాగం, భూగర్భనీటి పారుదల, వ్యవసాయ, ఉద్యాన, ఫారెస్ట్, ఇరిగేషన్ తదితర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు విరాళం



దుగ్గిరాల: స్థానిక కె.ఆర్.ఎం డిగ్రీ కళాశాలలో గ్రంథ పాలకునిగా ఉద్యోగ విరమణ చేసిన తమ్మా రాఘవరెడ్డి లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ కొత్త రవికిరణ్ మాట్లాడుతూ పదవీ విరమణ చేస్తున్న రాఘవరెడ్డి జీవితాంతం సుఖ, సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. చెక్కును కళాశాల యాజమాన్యానికి రాఘవరెడ్డి అందించారు. కార్యక్రమంలో సెక్రటరీ కె.సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపల్ కె.గిరిధర రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మూడు దేవస్థానాల హుండీల ఆదాయం రూ.10.78 లక్షలు



నగరంపాలెం(గుంటూరు వెస్ట్) : గుంటూరు నగరంలోని ఆంజనేయస్వామి దేవస్థానం, జగన్నాథస్వామి దేవస్థానం (కొత్తపేట), వేంకటేశ్వరస్వామి దేవస్థానం(లాలాపేట)ల హుండీలను సోమవారం లెక్కించారు. మూడు ఆలయాలకు మూడు నెలలకుగాను రూ.10,78,209లు ఆదాయం వచ్చింది. మూడు దేవస్థానాల ఈవో టి.సుభద్ర, తెనాలి వైకుంఠపురం వేంకటేశ్వరస్వామి ఆలయ ఈవో వి.అనుపమ పర్యవేక్షించారు.

ఇన్నర్ రింగ్ రోడ్డులో మహా గణపతి విగ్రహం

108 అడుగుల భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్న అమరావతి ఉత్సవ కమిటీ



ప్రత్తిపాడు: వినాయకచవితి పండుగను పురస్కరించుకుని గుంటూరు నగరం ఇన్నర్‌రింగ్ రోడ్డులో అతి పెద్ద వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు అమరావతి ఉత్సవ కమిటీ చైర్మన్ నరేంద్రరెడ్డి తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో కమిటీ సభ్యులు వివరాలను వెల్లడించారు. 108 అడుగుల భారీ ఎత్తుతో నిర్మించనున్న విగ్రహానికి ఆగస్టు 27వ తేదీన ప్రతిష్ట చేసి అన్ని సంప్రదాయ పూర్వక హోమాలు, పూజలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. చవితి ఉత్సవాల్లో భాగంగా రకరకాల స్టాల్స్, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మూవీ ఆర్టిస్టులతో ఈవెంట్లు నిర్వహిస్తామని, భక్తులకు అసౌకర్యం తలెత్తకుండా ఏర్పాట్లు చేయనున్నామని చెప్పారు. స్వచ్ఛమైన నల్లమట్టి, ఎర్రమట్టితో హాని కలిగించని రంగులతో సుందరంగా విగ్రహాన్ని తయారు చేయనున్నట్లు వివరించారు. సమావేశంలో వైస్‌చైర్మన్ రాజేష్, సెక్రటరీ లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ నగరానికి ఏమైంది?

- అదనంగా విధుల్లోకి తీసుకున్న కార్మికులు ఎక్కడ ?
- నగరంలో గ్రీనరీతో ఒక్క రోడ్డు కూడా లేదు
- 10వేల మొక్కలు కార్పొరేషన్‌కు వస్తే కనిపించేది 305 మాత్రమే..
- సచివాలయాల్లో ఇంటర్నెట్ సౌకర్యం కూడా లేని పరిస్థితి
- కౌన్సిల్‌లో అధికారులను నిలదీసిన ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు

గుంటూరులో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానం



వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, కూటమి కార్పొరేటర్ల మధ్య మాటల యుద్ధం

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్) : గుంటూరు నగరంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది.. అదనంగా 150 మందిని విధుల్లోకి తీసుకున్నా వారు ఎక్కడ పని చేస్తున్నారో కూడా తెలియదు.. ట్రాక్టర్లు డివిజన్‌కు ఒకటి కేటాయించామని అధికారులు చెబుతున్నా, ఎప్పుడు వస్తున్నాయో తెలియడం లేదంటూ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు అధికారులను నిలదీశారు. నగరపాలక సంస్థ సాధారణ కౌన్సిల్ సమావేశం సోమవారం నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అధ్యక్షతన నిర్వహించారు. తొలుత అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మృతులు, మాజీ కార్పొరేటర్ కారసాని సామ్రాజ్యానికి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలియజేశారు. సోమవారం కౌన్సిల్ సమావేశం మేయర్ అధ్యక్షతన ఉదయం 10.47గంటలకు ప్రారంభమైంది. సభ్యుల 35 ప్రశ్నలకు, 105 కార్పొరేషన్ ప్రియాంబుల్స్, ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు.

- **పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ** నగరంలో వీఐపీలు తిరిగే ప్రధాన రహదారి ఐటీసీ రోడ్డులో ఉన్న మూడు చోట్ల చెత్త పాయింట్లను శుభ్రపరచడంలో అధికారులు విఫలమయ్యారని ధ్వజమెత్తారు. ప్రధాన రాహదారే అధ్వానంగా ఉందని, ఇక నగరంలో పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చని విమర్శించారు. నగరంలోని సచివాలయాల్లో ఒక్కరే ఉద్యోగి పని చేస్తున్నారని, అతడు కూడా వాచ్‌మెన్‌గా డ్యూటీ చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఏదైనా సమాచారం అడిగితే సరైన సమాధానం ఇవ్వడం లేదని తెలిపారు. ప్రజాప్రతినిధులైన తమకు చెడ్డ పేరు వస్తుందని పేర్కొన్నారు. పర్మిషన్ లేని భవనాలు స్వయంగా చూపించినప్పటికీ ఇంత వరకు చర్యలు లేవని తెలిపారు. 21వ డివిజన్‌లో రోడ్డుకు అడ్డంగా బిల్డింగ్ కడితే దాన్ని కూల్చాలని కమిషనర్ టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశిస్తే ఇంత వరకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు.
- **తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ** చెత్త వేయకుండా గ్రీన్ మ్యాట్లు కట్టినా ఉపయోగం లేకుండా ఉందని తెలిపారు. అక్కడే చెత్త వేస్తున్నారని చెప్పారు. నగరంలో గ్రీనరీతో కూడిన బ్యూటిఫికేషన్ రోడ్డు ఒక్కటీ లేదని, కనీసం కార్పొరేషన్ కార్యాలయం ముందు కూడా చేసుకోలేకపోతున్నామని విమర్శించారు. పక్కనే ఉన్న తెనాలి, పొన్నూరులో గ్రీనరీ బాగుందని, కలెక్టరేట్ రోడ్డును కూడా అభివృద్ధి చేసుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నగరపాలక సంస్థకు 10వేల మొక్కలు వస్తే అందులో నాటింది 305 మాత్రమేనని, మిగిలిన వాటి సంరక్షణ ఏంటని? ఆయన ప్రశ్నించారు. సచివాలయాల్లో సక్రమంగా ఇంటర్నెట్ సౌకర్యం కూడా లేదని, పనుల మీద వచ్చిన ప్రజలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. అధికారులు ఇంటర్నెట్ కూడా ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నారా ?అని నిలదీశారు.
- **ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ** సుబ్బారెడ్డి నగర్‌లో రెండు సంవత్సరాల నుంచి కాంట్రాక్టర్ పని చేయడం లేదని, ఎందుకు అతని బ్లాక్ లిస్ట్‌లో పెట్టడం లేదంటూ ప్రశ్నించారు. 25వ డివిజన్‌లో అనధికార లే అవుట్స్ పెరిగిపోతున్నాయని వీటిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.
- గతంలో మా వార్డులో 60 మంది పారిశుద్ధ్య కార్మికులుంటే ప్రస్తుతం 30 మంది మాత్రమే ఉన్నారని..కాలువలు తీయడానికి మనుషులు లేరని కార్పొరేటర్ వెంకట కృష్ణ తెలియజేశారు.
- **అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు మాట్లాడుతూ** ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను కుదించే ప్రయత్నంలో ఉందన్నారు. నగరంలోని ఉన్న 207 వార్డు సచివాలయాలను 103 క్లస్టర్స్‌గా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఉద్యోగుల బదిలీల ప్రక్రియ అయిపోగానే సిబ్బంది రేషనలైజేషన్ చేస్తామని వెల్లడించారు.
- గుంటూరు నగరంలో 1256 హోర్డింగ్స్ ఉంటే అందులో 250కి మాత్రమే స్టెబిలిటీ సర్టిఫికేట్ ఉందని.. ప్రమాదం సంభవిస్తే ఎవరిది బాధ్యత అని కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి, షేక్ రోషన్, దూపాటి వంశీ కౌన్సిల్‌లో టౌన్‌ప్లానింగ్ అధికారులను నిలదీశారు.
- 17వ వార్డులో కాలువలు, డ్రైన్లపై కూడా భవన నిర్మాణానికి టౌన్ ప్లానింగ్ అధికారి లక్ష్మణస్వామి అనుమతులు ఇస్తున్నారని.. ఆయన్ను వెంటనే సస్పెండ్ చేయాలని కార్పొరేటర్ ఫర్జానా డిమాండ్ చేశారు. వార్డులో టీడీపీ నాయకుల పెత్తనం పెరిగిపోయిందని, దీన్ని కట్టడి చేయాలని ఆమె కోరారు.
- వార్డులో అభివృద్ధి పనుల్ని కార్పొరేటర్‌కు చెప్పకుండానే అభివృద్ధి పనులు ప్రారంభించారని...జేసీబీతో పనులు చేస్తున్న క్రమంలో వృద్ధుడి కాలు విరిగిందని..అసలు సిబ్బంది ఎవరూ లేకుండా పనులేలా చేస్తారంటూ కార్పొరేటర్ మల్లవరపు రమ్య నిలదీశారు.
- కార్మిక శాఖ స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని పాపతోటి అంబేద్కర్ కౌన్సిల్ అధికారులను కోరారు.

సమ్మె చేస్తున్న వారిపై చర్యలు: మేయర్



నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసే అవుట్ సోర్సింగ్ సిబ్బంది జీతాలు పెంచాలని కోరుతూ సమ్మె చేస్తున్నారని, వీధి లైట్లు వెలగనీవ్వడం లేదని పలువురు కార్పొరేటర్లు కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన మేయర్ రవీంద్ర మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది కలిగించేలా వారిపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు.

మాటలు సరిగా మాట్లాడు !

పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులు చెప్పే మాటలు మాత్రమే మేయర్ నమ్ముతున్నారని.. తమ మాటలు నమ్మడం లేదని టీడీపీ కార్పొరేటర్ నూకవరపు బాలాజీ ప్రశ్నించారు. మాటలు సరిగా మాట్లాడు.. ఇక్కడ ఎవరి మాటలు నమ్మాలో, నమ్మకూడదో తనకు తెలుసని, పని చేయని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని మేయర్ రవీంద్ర చెప్పారు.

పారిశుద్ధ్య నిర్వహణ వంద శాతం సంతృప్తి ఇవ్వదు: కమిషనర్

కార్పొరేటర్లు, ప్రజారోగ్య అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణ అనేది వంద శాతం సంతృప్తి ఇవ్వదని, మెరుగుదలకు అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నిర్ణీత గడువులోగా సమస్యలు పరిష్కరించాలి



ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్న కలెక్టర్, అధికారులు

ఉన్నతాధికారులకు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశం

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతి అర్జీని నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ పక్కన పెట్టవద్దని కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు ఇన్‌చార్జి కలెక్టర్ ఏ.బార్గవ్ తేజ, డెప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్, డీఆర్వో ఖాజావలి, ఆర్డీవో శ్రీనివాసరావు ప్రజల నుంచి 260 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారుని ఫిర్యాదును సరిగా ఎండార్స్ చేయడం లేదని, సంబంధిత శాఖలో సరైన అధికారికి పంపడం లేదన్నారు. ఉన్నతాధికారులు కూడా తనిఖీలు నిర్వహించకుండా కిందిస్థాయి అధికారులే పరిష్కరిస్తున్నారని తెలిపారు. సరిగా స్కాన్ చేయకుండా అప్‌లోడ్ చేస్తున్నారని, గ్రీవెన్స్ అధికారులే సమస్యను పరిష్కరించాలని ఆమె ఆదేశించారు. అర్జీదారుడికి సమస్యను పరిష్కరించిన విధానాన్ని క్షుణ్ణంగా తెలియ జేయాలని చెప్పారు. అధికారుల పనితీరుపై ఫీడ్‌బ్యాక్ అందించాలని తెలిపారు. ప్రజల్లో సంతృప్తి స్థాయి తగ్గుతోందని, దాన్ని పెంచడానికి అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ, ఉమెన్ కమిషన్, కోర్టు కేసులకు సంబంధించి నిర్ణీత సమయంలో కౌంటర్ దాఖలు చేయాలని కలెక్టర్ సూచించారు.

ఏసీబీకి చిక్కిన దేవదాయ శాఖాధికారి

రూ. 60 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు



ఏసీబీ అధికారులకు పట్టుబడిన ఈఓ నాగిశెట్టి శ్రీనివాసరావు (సర్కిల్‌లో)

కొల్లూరు : లంచాల కోసం వ్యాపారులను వేధిస్తున్న దేవదాయ శాఖ ఉద్యోగి ఏసీబీకి చిక్కారు. ఏసీబీ అడిషనల్ ఎస్పీ మత్తే మహేంద్ర కథనం మేరకు... బాపట్ల జిల్లా కొల్లూరు దేవాలయాల సమూహ ఈఓగా పనిచేస్తున్న నాగిశెట్టి శ్రీనివాసరావు కొద్ది రోజులుగా ఆలయ దుకాణాదారులను లంచాలు ఇవ్వాలని వేధింపులకు గురిచేస్తున్నాడు. కొల్లూరుకు చెందిన వంకాయల సాయి తన తండ్రి లక్ష్మీనారాయణ మరణించడంతో శ్రీ అనంతభోగేశ్వరాలయం పరిధిలో ఉన్న 6వ నంబర్ దుకాణాన్ని తన సోదరుడు రమేష్ పేరుమీదకు మార్చాలని శ్రీనివాసరావును పది రోజుల క్రితం కోరాడు. దుకాణం పేరు మార్పుకు రూ. లక్ష ఇవ్వాలని డిమాండ్ చేయడంతో, అంత మొత్తం ఇచ్చుకోలేనని తెలపడంతో రూ.70 వేలు చెల్లించాలని లేని పక్షంలో దుకాణం స్వాధీనం చేసుకుంటామని ఆలయ అధికారి హెచ్చరికలు చేశాడు. ఆలయ అధికారి అర్ధరాత్రి సమయాలలో సైతం ఫోన్‌లు చేసి లంచం నగదు కోసం వేధిస్తుండటంతో ఆయన అడిగిన మొత్తం సోమవారం ఇస్తానని సాయి ఒప్పుకొని ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. కొల్లూరులోని వేణుగోపాలస్వామి ఆలయంలోని ఈఓ కార్యాలయంలో దుకాణదారుడు సాయి ఏసీబీ అధికారుల సూచనల మేరకు ఈఓకు రూ.60 వేలు నగదు చెల్లింపులు జరుపుతుండగా, అకస్మాత్తుగా దాడులు నిర్వహించి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దుకాణదారుడి నుంచి లంచంగా తీసుకున్న రూ. 60 వేలు నగదును స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు, ఈఓ కార్యాలయంలోనే రసాయనాలతో పలు పరీక్షలు నిర్వహించి లంచం తీసుకున్నట్లు నిర్ధారించి దేవాదాయ శాఖాధికారి శ్రీనివాసరావును అదుపులోకి తీసుకున్నారు. ఈఓ శ్రీనివాసరావును మంగళవారం విజయవాడలోని ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు మహేంద్ర వెల్లడించారు. దాడులలో ఏసీబీ సీఐలు నాగరాజు, మన్మధరావు, సురేష్, సుబ్బారావు, ఎస్‌ఐలు చిచ్చా ఉరుకొండ, సుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల అనుమతి తప్పనిసరి

నగరంపాలెం (గుంటూరు వెస్ట్) : జిల్లాలో సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, నిరసనలు, బంద్‌లు నిర్వహించాలంటే ముందస్తుగా పోలీసుల అనుమతులు తప్పనిసరని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయ పార్టీలు, మత సంస్థలు, కుల, ప్రజా, విద్యార్థి, ఉద్యోగ సంఘాలు, ఇతరత్రా సంఘాలు వారం రోజులు ముందుగా ఆ ప్రాంత పరిధిలోని పోలీస్‌స్టేషన్ అధికారి నుంచి అనుమతులు తీసుకోవాలని సూచించారు. పేరు, చిరునామా, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్, కార్యక్రమాల తేదీ, సమయం, స్థలం, ప్రదేశం యజమాని అనుమతి పత్రం తదితర వివరాలను అందించాలని తెలిపారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీస్ యాక్ట్-30 అమల్లో ఉంటుందని అన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఎటువంటి కార్యక్రమాలైనా చట్టపరంగా పోలీసులు రద్దు చేస్తారని ఆయన పేర్కొన్నారు.


కనుల పండువగా జగన్నాథ రథయాత్ర



శివాజీ చౌక్‌లో ఆరంభమైన జగన్నాథ రథయాత్ర

తెనాలి: ఇస్కాన్ తెనాలి ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర సోమవారం కన్నులపండువగా జరిగింది. రథ్‌ఫెస్ట్-2025 పేరుతో నాలుగు రోజుల పాటు చేపట్టిన ఉత్సవాల మూడో రోజు రథయాత్ర నిర్వహించారు. పట్టణ శివాజీ చౌక్ నుంచి మధ్యాహ్నం రథయాత్రను ఆరంభించారు. గాంధీ చౌక్, నెహ్రూ రోడ్డు, రజక చెరువు, ప్రకాశం రోడ్డు, గంగానమ్మపేట, గాడి బావి సెంటర్, బోసు రోడ్డు, చినరావూరు పార్కుకు వెళ్లి, తిరిగి బోసు రోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం ప్రాంగణానికి చేరుకుంది. అక్కడ ఏర్పాటు చేసిన గుండిచా మందిరంలో జగన్నాథుడు, బలదేవుడు, సుభద్ర మాతను కొలువుదీర్చి, ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు జగన్నాథుడు, రథయాత్ర విశిష్టతను తెలియజేశారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. ఒకటో తేదీ సాయంత్రం వరకు జగన్నాథుడు, బలదేవుడు, సుభద్ర మాత అక్కడే కొలువై ఉంటారు. సుభద్ర దేవీకి సౌభాగ్య సారె కార్యక్రమం నిర్వహిస్తారు. రథయాత్రకు ముందు విజయవాడకు చెందిన జిజ్ఞాస సాంస్కృతిక సంస్థ వారి క్యూరేషన్‌లో పలు సాంస్కృతిక అంశాలను ప్రదర్శించారు. ఇస్కాన్, తెనాలి మేనేజరు హెచ్‌జీ సింహగౌరదాస్ పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకలో దేశం నలుమూలల్నుంచి కళాకారులు పాల్గొన్నారు. విదేశీ భక్తులు కమలకాంత దాస్, జిజ్ఞాస నుంచి రథయాత్ర క్యూరేటర్ రోహిణి వైష్ణవి, కన్వీనర్ వెంకటేష్ బత్తుల, గీతిక, మీనాక్షి, మేఘన, రవితేజ, మోహనకృష్ణ పాల్గొన్నారు. రథ్ ఫెస్ట్‌లో భాగంగా 28, 29 తేదీల్లో పిల్లలకు, యువతకు సాంస్కృతిక పోటీలను నిర్వహించిన సంగతి తెలిసిందే.

దుర్గమ్మకు భక్తుల ఆషాఢ సారె



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు భక్తులు ఆషాఢ సారెను సమర్పిస్తున్నారు. సోమవారం రికార్డు స్థాయిలో భక్తులు, భక్తబృందాలు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. సోమవారం ఉదయం నుంచి వాతావరణం ఆహ్లాదకరంగా ఉండటంతో భక్తులు విశేషంగా తరలిరావడం కనిపించింది. ఉదయం నుంచి ప్రారంభమైన సారె సంబరం మధ్యాహ్నం వరకు కొనసాగింది. ఆలయ వైదిక కమిటీ సభ్యుడు కోట ప్రసాద్ కుటుంబం అమ్మవారికి ఆషాఢ సారెను సమర్పించింది. నగరంతో పాటు గుంటూరు, ఏలూరు, రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి భక్తులు సారె సమర్పించేందుకు తరలివచ్చారు. అమ్మవారికి సారె సమర్పించేందుకు విచ్చేసిన భక్త బృందాలకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం మహామండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తికి సారెను సమర్పిస్తున్నారు. సారె సమర్పించేందుకు విచ్చేసిన భక్త బృందాలతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది.

గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేస్తాం..



పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు, అధికారులు

జే.పంగులూరు: కూటమి ప్రభుత్వం పొగాకు రైతులకు అండగా, వారికి గిట్టుబాటు ధరను కల్పిస్తూ మార్కెఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేస్తుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, గృహనిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి, కలెక్టర్ వెంకటమురళి అన్నారు. మండల పరిధిలోని మార్కెట్ యార్డులో నల్ల బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లో మొత్తం 18 పొగాకు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సోమవారం పంగులూరు, పర్చూరు, ఇంకొల్లు మూడు కేంద్రాలు ప్రారంభిస్తున్నామన్నారు. రైతులు అధైర్యపడొద్దని, పండించిన పొగాకును పూర్తిగా కొనుగోలు చేస్తామన్నారు. మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ రైతులు పండించిన పంటను అమ్ముకోలేని దీనస్థితిలో ఉన్నారన్నారు. పొగాకు కొనుగోలుకు ప్రభు త్వం రూ.270 కోట్లు కేటాయించిందన్నారు. అనంతరం మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ రైతులకు మంచి గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేస్తామన్నారు. రైతుల వద్ద ఉన్న చివరి ఆకు వరకు కొనుగోలు చేస్తామన్నారు. పొగాకు సరుకును బట్టి రూ.6 వేలు నుంచి రూ.12 వేల వరకు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు



గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1,000 గరిష్ఠం : రూ. 1,800

మోడల్ ధర రూ. 1,400

మిర్చి యార్డు సమాచారం
(సోమవారం ధరలు)



వచ్చిన బస్తాలు	41,119
అమ్మకాలు	38,592
నిల్వ	6,935

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	రూ. 9,500 - 13,200
నంబరు-5	రూ. 10,000 - 13,400
341	రూ. 10,000 - 13,300

నాన్ ఏసీ ప్రత్యేక రకం క్వింటా (రూ.)

తేజ	రూ. 10,000 - 13,400
బాడిగ - 355	రూ. 10,000 - 13,000
ఆర్మూర్	రూ. 9,800 - 11,000
తాలుకాయలు	రూ. 5,000 - 6,800

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	రూ. 9,700 - 13,000
నంబరు-5	రూ. 10,000 - 13,300
341	రూ. 10,000 - 13,200
4884	రూ. 10,000 - 12,500

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	రూ. 10,000 - 13,500
బాడిగ - 355	రూ. 10,000 - 13,300
దేవనూరు డీలక్స్	రూ. 10,000 - 12,500
తాలుకాయలు	రూ. 5,500 - 7,000

-కొరిటెపాడు (గుంటూరు)



పసుపు ధరలు
(సోమవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 754

కొమ్ములు : 565 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
9,625	10,350	10,200

కాయలు : 155 బస్తాలు

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
9,625	10,400	10,175

మొత్తం అమ్మకాలు : 565.500 క్వింటాళ్లు

-దుగ్గిరాల

క్లుప్తంగా

ఏపీ పీజీ సెట్‌లో మురళి ప్రియకు 2వ ర్యాంకు



గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఇటీవల ప్రకటించిన పీజీ కోర్సుల ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఏపీ పీజీ సెట్–2025) ఫలితాల్లో జేకేసీ కళాశాల లైఫ్ సైన్స్ విభాగ డిగ్రీ తృతీయ సంవత్సర విద్యార్థిని కామరాజు సాయి మురళి ప్రియ రాష్ట్రస్థాయిలో 2వ ర్యాంకు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ తెలిపారు. సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఏపీ పీజీ సెట్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థిని ప్రతిభ చాటడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కె.సాంబశివరావు, బయోటెక్నాలజీ–మైక్రో బయాలజీ విభాగాధిపతి ఎం. గురువయ్య, అధ్యాపకులు విద్యార్థిని సాయి మురళి ప్రియకు అభినందనలు తెలియజేశారు.

జిల్లాలో 13 మండలాల్లో వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు 13 మండలాల్లో వర్షం పడింది. అత్యధికంగా మేడికొండూరు మండలంలో 22.4 మిల్లీ మీటర్లు పడగా, అత్యల్పంగా వట్టిచెరుకూరు మండలంలో 0.4 మి.మీ. పడింది. సగటున 3.8 మి.మీ. నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. గుంటూరు పశ్చిమలో 8.8 మి.మీ., దుగ్గిరాల 7.6, తాడేపల్లి 6.2, తెనాలి 5.6, తుళ్లూరు 4.4, చేబ్రోలు 3.6, తాడికొండ 2.8, కొల్లిపర 2.6, మంగళగిరి 2.2, ఫిరంగిపురం 1.6, పెదకాకాని మండలంలో 1 మి.మీ. చొప్పున వర్షం పడింది. జూన్ చివరి నాటికి జిల్లాలో సాధారణ వర్షపాతం 97.1 మి.మీ. పడాల్సి ఉండగా, 68.7 మి.మీ. మాత్రమే నమోదైంది.

'ఉపాధి'లో అక్రమాలపై విచారణ చేయించాలి

వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగ అధ్యక్షులు దాసరి రాజు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దాసరి రాజు, నాయకులు

లక్ష్మీపురం: ఉపాధి హామీ పథకం పనుల్లో అవినీతిపై కేంద్ర ప్రభుత్వం విచారణ చేయించాలని వైఎస్సార్ సీపీ పంచాయతీ రాజ్ విభాగ అధ్యక్షులు దాసరి రాజు కోరారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని శంకర్ భవన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులు వెన్నుపూస రవీంద్రరెడ్డి సూచనల మేరకు తాడికొండ, మంగళగిరి, ప్రత్తిపాడు నియోజకవర్గ నాయకులు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దాసరి రాజు మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ చట్టం మేరకు ఉపాధి హామీ పనులను గ్రామ పంచాయతీల ద్వారానే జరిపించాలని డిమాండ్ చేశారు. కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించాలని కోరారు. సర్పంచులకు కూడా తల్లికి వందనం పథకాన్ని తక్షణమే వర్తింపజేయాలని విన్నవించారు. 15వ ఫైనాన్స్ కమిషన్ విడుదల చేసిన రూ.1,150 కోట్లను స్థానిక సంస్థలకు తక్షణమే జమ చేయాలని డిమాండ్ చేశారు. బిల్లుల చెల్లింపుల్లో రాజకీయ జోక్యం నివారించాలని కోరారు. కార్యక్రమంలో తాడికొండ, మంగళగిరి, ప్రత్తిపాడు నియోజకవర్గం పంచాయతీరాజ్ అధ్యక్షులు పూసపాటి వెంకటరామిరెడ్డి , ఈపూరు రమేష్, దొడ్డా రాంజీ అంబేడ్కర్, ఫిరంగిపురం మేడుకొండూరు మండలాల పంచాయతీ రాజ్ అధ్యక్షులు గుత్తికొండ ప్రతాపరెడ్డి, షేక్ హాజీ, తాడికొండ, మేడికొండూరు మండలాల పార్టీ అధ్యక్షులు ముప్పాళ్ల మనోహర్, తాళ్లూరి వంశీ, తాడికొండ మండల మైనారిటీ అధ్యక్షులు షేక్ బాబావలి, పార్టీ నాయకులు గుత్తికొండ అంజిరెడ్డి, పెరికల చిన్న, గంపల గంగాధర్ యాదవ్, బాకీ వెంకటస్వామి, మాదాసు ధర్మరాజు, షేక్ మీర్జావలి షేక్ సలీం, గుంటి రఘువరన్ గోల్డు బాబు, రాయపూడి ఇమ్మానియేలు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న కిరణ్‌రాజ్

'సదరం' కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

లక్ష్మీపురం: సదరం సర్టిఫికెట్ రీవెరిఫికేషన్ కేంద్రాల్లో దివ్యాంగులకు మౌలిక వసతులు కల్పించాలని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షులు బందెల కిరణ్‌రాజ్ కోరారు. వికలాంగుల హక్కుల చట్టానికి సంబంధించిన విధివిధానాలను అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పటిష్టంగా అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్‌రాజ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఒక్క కొత్త పెన్షన్, సదరం సర్టిఫికెట్ కూడా మంజూరు చేయలేదని విమర్శించారు. గుంటూరు జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షులు బొక్క అగస్టీన్ మాట్లాడుతూ పెన్షన్ రీ వెరిఫికేషన్ ప్రక్రియ తీసుకువచ్చి ఆరోగ్య కేంద్రాల చుట్టూ దివ్యాంగులను తిప్పుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో దివ్యాంగుల విభాగం ప్రత్తిపాడు నియోజకవర్గ అధ్యక్షులు నాగుల్ మీరా, నాయకులు గణేష్, కిరణ్ పాల్గొన్నారు

ఉద్యోగాల పేరిట లక్షలాది రూపాయలు కాజేశారు

ఎస్పీ సతీష్‌కుమార్‌కు బాధితుల మొర

నగరంపాలెం: ఉద్యోగాల పేర్లతో లక్షలాది రూపాయలు కాజేసి, మోసగించారంటూ బాధితులు వాపోయారు. నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం ప్రజా ఫిర్యాదులు – పరిష్కారాల వ్యవస్థ నిర్వహించారు. అర్జీదారుల నుంచి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఫిర్యాదులు స్వీకరించారు. వాటిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. జిల్లా ఏఎస్పీ రమణమూర్తి (పరిపాలన), డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి (మహిళా పీఎస్), శివాజీ (క్రైం), రమేష్ (ట్రాఫిక్) కూడా అర్జీలు స్వీకరించారు.



బాధితుల సమస్యను అలకిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నకిలీ నియామక పత్రాలతో మోసం

గతేడాదిలో తెలిసిన వ్యక్తి పరిచయమయ్యారు. నేషనల్ హెల్త్ అథారిటీ సంస్థలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికాడు. దీంతో ముగ్గురం కలిసి అతనికి సుమారు రూ.16.80 లక్షలు చెల్లించాం. గతేడాది నవంబర్ 4న ఢిల్లీ వెళ్లగా, అవి నకిలీ గుర్తింపు కార్డులు, నియమాక పత్రాలను అధికారులు బదులిచ్చారు. కేంద్ర ప్రభుత్వంలో అటువంటి సంస్థ లేదని చెప్పడంతో మోసపోయినట్లు గుర్తించాం. దీంతో డబ్బులు అడగ్గా, రూ.3.80 లక్షలు మాత్రమే చెల్లించాడు. మిగతా డబ్బులు అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నాడు.

– ఓ యువకుడు, రావెల, తాడికొండ మండలం

పొలం ఇప్పించాలి

గుంటూరు రూరల్ పరిధిలోని వెంగళాయపాలెంలో మాకు 46 సెంట్లు పొలం ఉంది. 2006లో మాజీ ఎమ్మెల్యే సోదరుని వద్ద దాన్ని రూ.5 లక్షలకు తనఖా పెట్టాం. మధ్యవర్తిగా వ్యవహరించిన వ్యక్తి మాకు డబ్బు ఇవ్వకుండా మాజీ ఎమ్మెల్యేకు అప్పగించాడు. పొలం తనఖాకు సంబంధించి డబ్బులతో పాటు అదనంగా చెల్లిస్తామని, కాగితాలు ఇవ్వాలంటూ ప్రాథేయపడుతున్నా కనికరించడం లేదు. మాకు పొలం ఒక్కటే జీవనాధారం. గతంలో జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదు. న్యాయం చేయాలి.

– సీహెచ్.భాగ్యలక్ష్మి, రామారావు, వెంగళాయపాలెం

ఉద్యోగాల పేరుతో రూ.4 లక్షలు వసూలు

కలెక్టరేట్‌లోని ఓ అటెండర్ ద్వారా శారదా కాలనీ పదో వీధిలో ఉంటున్న వ్యక్తి ఆరు నెలలు క్రితం పరిచయమయ్యారు. లాంఫాంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా, జిల్లా కోర్టు జడ్జి కార్యాలయంలో అటెండర్‌గా ఇప్పిస్తానని నమ్మించాడు. నాకు, నా బామరిది సాంబశివరావును రెండు ఉద్యోగాలకు రూ.6 లక్షలు అడిగాడు. ఈ ఏడాది జనవరి 23న రూ.4 లక్షలు చెల్లించాం. దీంతో లాంఫాం, జిల్లా కోర్టులో జడ్జి కార్యాలయాల వద్దకు తీసుకెళ్లి మంత్రి లోకేష్ పేషీ నుంచి వచ్చామని హడావుడి సృష్టించాడు. ఆ తర్వాత రోజు వెళ్తే ఉద్యోగాల్లేవు. మొబైల్‌కు ఫోన్ చేస్తే కట్ చేయడం, సెల్ నంబర్లను బ్లాక్‌లో ఉంచాడు. ఇంటికెళ్లి డబ్బులు అడిగితే సరైన సమాధానం లేదు. న్యాయం చేయాలి.

– ఎం.భవాని, భారత్‌పేట ఐదో వీధి

సుప్రీం ఆదేశాలను అమలుచేయాలి

కళ్లకు గంతలు కట్టుకుని గాంధీ నాగరాజన్ వినూత్న ప్రచారం



సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న నాగరాజన్

తెనాలి: మహాత్మా గాంధీజీ ఆదర్శంగా ఆయన సూత్రాలను ప్రచారం చేస్తున్న పట్టణానికి చెందిన గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు గాంధీ నాగరాజన్ సోమవారం వినూత్న కార్యక్రమం చేపట్టారు. గాంధీ వస్త్రధారణతో కళ్లకు గంతలు కట్టుకుని, పోలీస్ సంస్కరణలపై సుప్రీం తీర్పుకు సంబంధించిన అంశాలను ప్రచారం చేశారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. పోలీసు సంస్కరణలపై ఐపీఎస్ అధికారి ప్రకాష్‌సింగ్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై సుప్రీం కోర్టు పోలీస్ వ్యవస్థలో స్వయం ప్రతిపత్తి, జవాబుదారీతనం పెంచటానికి జారీ చేసిన ఏడు ముఖ్యమైన ఆదేశాలను గాంధీ నాగరాజన్ ప్రస్తావించారు. పోలీస్ విధులను రాజకీయ జోక్యం నుంచి రక్షించడానికి, పోలీసులకు మార్గదర్శకత్వం వహించడానికి రాష్ట్ర భద్రతా కమిషన్ ఏర్పాటు ఆయన కోరారు. ఎస్పీ, డీజీపీలకు రెండేళ్ల పదవీ కాలం నిర్ణయించాలని, పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలని విన్నవించారు. పోలీస్ కంప్లయింట్స్ అథారిటీ ఏర్పాటు, దర్యాప్తు, శాంతిభద్రతల విభజన వంటి అంశాలను అమల్లోకి తీసుకురావాలని ఆయన కోరారు.

ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆచార్య లింగరాజు

ఏఎన్‌యూ: డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా యూనివర్సిటీ సైన్స్ ఫిజిక్స్ విభాగాధిపతి సీహెచ్. లింగరాజు నియమితులయ్యారు. వీసీ కె. గంగాధరరావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ జి. సింహాచలం సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా నియమితులైన లింగరాజుకు యూనివర్సిటీ ఉన్నతాధికారులు, ఇంజినీరింగ్ కళాశాల సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు. కోర్సులు పూర్తి చేసే విద్యార్థులకు వంద శాతం ప్లేస్‌మెంట్స్ కల్పన, నైపుణ్య లక్షణాల పెంపొందింపు లక్ష్యంగా చర్యలు చేపడతానని పేర్కొన్నారు.

చిల్డ్రన్స్ హోం సందర్శన



గుంటూరు లీగల్: క్యాలెండరు యాక్టివిటీస్‌లో భాగంగా జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు గుంటూరు బాలిక సదన్‌లోని చిల్డ్రన్స్ హోంను సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్ సందర్శించారు. సదుపాయాల గురించి పిల్లల్ని అడిగి తెలుసుకున్నారు. హోంలో ఆహారం, విద్య, వైద్యంతో పాటు రూములను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. న్యాయ సహాయం కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని తెలిపారు. ఆయన వెంట బాలిక సదన్ సూపరింటెండెంట్ కవిత, సిబ్బంది ఉన్నారు.

కులం పేరుతో దూషణ, దాడి



దుగ్గిరాల పోలీస్ స్టేషన్ ముందు ధర్నా చేస్తున్న యానాది యూత్ ఫెడరేషన్ నాయకులు

దుగ్గిరాల: కులం పేరుతో దూషించి, స్పృహ కోల్పోయేటట్లు కొట్టిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ యానాది యూత్ ఫెడరేషన్ నాయకులు సోమవారం దుగ్గిరాల పోలీసు స్టేషన్ ముందు ధర్నా చేశారు. యానాది కులానికి చెందిన కన్నం మాధవి, కన్నం మరియమ్మ, వి.నరేంద్రబాబులు ఆదివారం కె.ఆర్. కొండూరు గ్రామంలో షాపింగ్ చేసుకొని వస్తుండగా ఇద్దరు చిన్న పిల్లలు తగువులాడుకుంటూ ఉండగా గొడవ ఎందుకని వారికి సర్ది చెప్పి వెళుతున్నారు. ఈ సమయంలో నలుగురు ముస్లిం యువకులు పెద్దగా అరుస్తూ వారిని కులం పేరుతో తిట్టి, కొట్టి గాయపరచారు. కేసు పెట్టేందుకు వెళుతుంటే అడ్డగించి బెదిరించారు. విషయాన్ని యానాది యూత్ ఫెడరేషన్ దృష్టికి తీసుకెళ్లారు. బాధితులతో కలసి సోమవారం దుగ్గిరాల పోలీసు స్టేషన్ ముందు ధర్నా చేశారు. యానాది యూత్ ఫెడరేషన్ గుంటూరు జిల్లా అధ్యక్షులు కొమరగిరి సూరిబాబు, రావూరి గోపి, అశోక్, మరియమ్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో వృద్ధుడికి యావజ్జీవం

గుంటూరు లీగల్: పోక్సో కేసులో వృద్ధుడికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ గుంటూరు జిల్లా పోక్సో న్యాయస్థానం సోమవారం తీర్పు వెలువరించింది. 2020 డిసెంబరు 8న రాత్రి పెదకాకాని పోలీస్ స్టేషన్ పరిధిలో తొమ్మిది సంవత్సరాలబాలికపై షేక్ నబి రసూల్ రహమతుల్లా (57) లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లి, బంధువులు చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఘటనపై బాధితురాలు తల్లి, బంధువులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా గుంటూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో అప్పటి డీఎస్పీ కె.రవికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పోక్సోతో పాటు పలు కేసులను నమోదు చేశారు. అనంతరం మహిళా ఎస్ఐ జె.అనురాధ బాధితురాలి వాంగ్మూలాన్ని వివరంగా నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన ఆధారాలను పోక్సో కోర్టు ముందు ఉంచగా న్యాయమూర్తి ఎస్.ఎం.టి. మొహమ్మద్ పర్వీన్ సుల్తానా బేగం నిందితుడికి యావజ్జీవ జైలుశిక్ష, రూ.10వేలు జరిమానా విధించారు. దర్యాప్తు అధికారి కె.రవి కుమార్, ఏపీపీ బర్కత్ అలీఖాన్ ఈ కేసులో వాదనలు వినిపించారు. నిందితుడికి శిక్ష విధించడానికి విశేష కృషి చేసిన గుంటూరు జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డిని, ఏపీపీని, కోర్టులో కేసు విచారణ ప్రక్రియను పర్యవేక్షించిన సీఐ నరసింహారావును, కోర్టు కానిస్టేబుల్‌ను గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అభినందించారు.

జాతీయ ఫెన్సింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



పోటీల్లో గెలుపొందిన గుంటూరు క్రీడాకారులు

లక్ష్మీపురం: విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సోమవారం 6వ రాష్ట్రస్థాయి అండర్ 10,12 విభాగాల్లో ఫెన్సింగ్ పోటీలు జరిగాయి. జిల్లా బాలబాలికలు 4వ స్థానం సాధించారని జిల్లా ఫెన్సింగ్ అనానిమిషన్ ప్రధాన కార్యదర్శి డి. అశోక్‌బాబు తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులు జులై 5 నుంచి 7వ తేదీ వరకు మహారాష్ట్రలోని నాసిక్ జరిగే జాతీయ పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. బాలికల 11–12 విభాగంలో డి.జోష్ని, బి.శ్రీలక్ష్మి, యు.శ్వేత, ఫాఈల్‌లో ఎం.శ్లోక, ఆర్షియా హస్నా, సేబార్‌లో జి.హన్సిత, నాగశ్రీ ఎంపికైనట్లు తెలియజేశారు. అండర్- 12 విభాగం సేబార్‌లో ఎం.చైతన్య సాయి, జె.పృథ్వి, వినయ్, బాలికల అండర్- 10 ఇప్పిలో బి.దీక్షిత, రాథోడ్, జి.తన్మయిశ్రీ , ఎం.స్నేహాశీ, సేబార్‌లో సి.అరోహి, అండర్- 10 కేటగిరి బాలురు ఫాఈల్‌లో పి.రిశాంక్ శర్వాన్, పి.రిత్విక్ ఎంపికైనట్లు అశోక్‌బాబు వెల్లడించారు.

వైభవంగా కావడి సేవ

బాపట్ల: శ్రీ సుబ్రహ్మణ్య స్వామి కావడి సేవా మహోత్సవాన్ని సోమవారం చేపట్టారు. బాపట్ల కోన కళాక్షేత్రంలో శ్రీ లలితా త్రిపుర సుందరీ పీఠం ఆధ్వర్యంలో ఉదయం కావడి సేవా మహోత్సవం, అభిషేకం, పుష్పయాగం, సర్పసూక్త హోమం నిర్వహించారు. నెమలికంటి హనుమంతరావు సారథ్యంలో ముత్తేవి శ్రీనివాస శశికాంత్ ఆధ్వర్యంలో ఉత్సవం చేపట్టారు. కార్యక్రమంలో మేడూరి వెంకట అప్పలాచార్యులు, రొంపిచర్ల కేశవాచార్యులు పాల్గొన్నారు.